దిక్సూచి

సివిల్ సర్వీసెస్- 2010

గెట్ రెడీ

సమాజంలో అత్యున్నత హోదా పొందాలంటే సివిల్స్‌లో విజయం సాధించాల్సిందే. ఇది జగమెరిగిన సత్యం. అభ్యర్థులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'సివిల్స్ నోటిఫికేషన్-2010' వెలువడింది. ఇకపై ప్రతి రోజునూ సద్వినియోగం చేసుకుంటూ సన్నద్ధం కావడమే తరవాయి.. గెట్ రెడీ.!

గత కొద్ది సంవత్సరాలుగా సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులు మన రాష్ట్రంలోనూ ఉన్నారు. వరుసగా రెండు పర్యాయాలూ రాష్ట్రానికి చెందిన వారే మొదటి ర్యాంకు పొందారన్నది అందరికీ తెల్సిందే. గత ఏడాది జాతీయ స్థాయిలో సుమారు నాలుగు లక్షల మంది సివిల్స్‌కు పోటీపడ్డారు. ఈసారి రమారమి వెయ్యి పోస్టులు ఉన్నాయి. పోటీ అదే స్థాయిలో ఉంటుందని భావించవచ్చు.

ఈ నేపథ్యంలో సివిల్స్ గత విజేతల మాటలను ఒక్కసారి మననం చేసుకోవాలి. పద్ధతిగా చదివితే తేలికగానే విజయం సొంతం చేసుకోవచ్చన్నది మూకుమ్మడి అభిప్రాయం. అందుకోసం ఆప్షనల్స్ ఎంపిక చేసుకోవడం మొదలుకుని ప్రతి విషయంలోనూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రిపరేషన్‌లో దారితప్పకూడదు. కరెంట్ అఫైర్స్ మొదలుకుని ప్రతి అంశానికీ ఇది వర్తిస్తుంది. ఈ క్రమంలో మొదట సివిల్స్‌కు దరఖాస్తుతో మీ యత్నాన్ని మొదలుపెట్టండి.

'సివిల్స్ నోటిఫికేషన్-2010'

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే 'సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2010' నోటిఫికేషన్ విడుదలయింది. సంబంధిత ప్రాథమిక పరీక్ష 2010 మే 23న నిర్వహిస్తారు.

భర్తీ చేయాల్సిన ఖాళీలు సుమారు 965. అయితే ఆ సంఖ్య పెరగనూ వచ్చు లేదా తగ్గనూ వచ్చు.

పై ఉద్యోగాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధానం మేరకు ఎస్సీ-ఎస్టీ, బీసీ, పీహెచ్ విభాగాలకు చెందిన అభ్యర్థులకు రిజర్వేషన్ ఉంటుంది.

అర్హతలు

వయో పరిమితి: అభ్యర్థులు 2010 ఆగస్టు 1 నాటికి 21 సంవత్సరాలకు తక్కువ కాకుండా, 30 ఏళ్లకు మించకుండా ఉండాలి. నిబంధనల మేరకు ఎస్సీ-ఎస్టీ, బీసీ ఇతర వర్గాలకు వయో సడలింపు వర్తిస్తుంది.

విద్యార్హతలు: ఏదేనీ గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన అర్హత.

శారీరక ప్రమాణాలు: భారత ప్రభుత్వం సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2010 కోసం వెలువరించిన గెజిట్‌లోని అనుబంధం-3లో పేర్కొన్న విధంగా శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎవరికెన్ని అవకాశాలు?

సివిల్స్ రాయాలని భావించే అభ్యర్థులకు ప్రభుత్వం కొన్ని పర్యాయాలు మాత్రమే రాసేందుకు అవకాశం కల్పించింది. వివిధ వర్గాల వారు ఈ విధంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరు కావచ్చు.

జనరల్ అభ్యర్థులు-నాలుగుసార్లు, జనరల్ (పీహెచ్) అభ్యర్థులయితే ఏడు సార్లు రాయవచ్చు. అలాగే ఓబీసీ అభ్యర్థులు ఏడుసార్లు హాజరుకావచ్చు. ఎస్సీ-ఎస్టీ అభ్యర్థులకు పరిమితి లేదు.

దరఖాస్తు ఫారం

అభ్యర్థులు కమిషన్ నిర్దేశించి ఫారం ద్వారానే దరఖాస్తులు చేయాలి. సంబంధిత దరఖాస్తు ఫారాలు కమిషన్ సూచించిన పోస్టాఫీసులు/ హెడ్ పోస్టాఫీసుల్లో లభ్యం అవుతాయి. వాటిని 20 రూపాయలు చెల్లించి అభ్యర్థులు పొందవచ్చు. ఆయా పోస్టాఫీసుల్లో దరఖాస్తు ఫారాలు లభించని పక్షంలో యూపీఎస్సీ దరఖాస్తుల సరఫరా పర్యవేక్షణ విభాగాన్ని సంప్రతించవచ్చు. ఫోన్ నంబర్: 011-23389366-ఫాక్స్ నంబర్: 011-23387310.

ఫీజు

ఓబీసీ అభ్యర్థులు సహా అందరూ 50 రూపాయల విలువైన సెంట్రల్ రిక్రూట్‌మెంట్ ఫీ స్టాంప్‌లను దరఖాస్తుతో పాటు జత చేయాలి. (ఎస్సీ-ఎస్టీ, మహిళలు, పీహెచ్ అభ్యర్థులకు మినహాయింపు ఉంది.)

చిరునామా:

పూర్తి చేసిన దరఖాస్తులను కింది చిరునామాకు పంపించాలి.

సెక్రటరీ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్,
ధోల్‌పూర్ హౌస్, షాజహాన్ రోడ్,
న్యూఢిల్లీ-110 069.

చివరి తేదీ: పూర్తి చేసిన దరఖాస్తులు పైన పేర్కొన్న చిరునామాకు..వ్యక్తిగతంగా, పోస్టు/ స్పీడ్ పోస్టు, కొరియర్ ద్వారా 2010 ఫిబ్రవరి 1 లోపు చేరాలి.

సందేహాలు వస్తే..

అభ్యర్థులకు తమ అభ్యర్థిత్వం విషయంలో సాయం/ వివరణ/ సమాచారం/ మార్గ దర్శకం అవసరమైన పక్షంలో వ్యక్తిగతంగా యూపీఎస్సీ క్యాంపస్‌లోని 'సీ' గేట్ వద్ద ఉన్న ఫెసిలిటేషన్ కేంద్రాన్ని అన్ని పని దినాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సంప్రతించవచ్చు. ఫోన్ నంబర్లు: 011-23385271/23381125.

మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 2010 జనవరి 2 నాటి 'ఎంప్లాయ్‌మెంట్ న్యూస్/ రోజ్‌గార్ సమాచార్ సంచికను చూడవచ్చు.

వెబ్‌సైట్: http://www.upsc.gov.in

ఈ పరీక్ష ద్వారా ఎంపికయ్యే వివిధ సర్వీసులు

1. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్)
2. ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)
3. ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) (గ్రూప్ 'ఏ' సర్వీసులు)
4. ఇండియన్ పి అండ్ టి అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ సర్వీస్
5. ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్
6. ఇండియన్ రెవిన్యూ సర్వీస్ (కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సయిజ్)
7. ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్
8. ఇండియన్ రెవిన్యూ సర్వీస్
9. ఇండియన్ ఆర్డెనెన్స్ ఫ్యాక్టరీస్ సర్వీస్ (అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్, అడ్మినిస్ట్రేషన్)
10. ఇండియన్ పోస్టల్ సర్వీస్
11. ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్
12. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్
13. ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్
14. ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్
15. అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఆర్‌పీఎఫ్)
16. ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్
17. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (జూనియర్ గ్రేడ్)
18. ఇండియన్ ట్రేడ్ సర్వీస్ (గ్రేడ్-3)
19. ఇండియన్ కార్పొరేట్ లా సర్వీస్
20. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హెడ్ క్వార్టర్స్-గ్రూప్-బి (సెక్షన్ ఆఫీసర్ గ్రేడ్)
21. ఢిల్లీ, అండమాన్-నికోబార్, లక్ష దీవులు, డయ్యూ-డామన్, దాద్రా-నాగర్ హవేలీ సివిల్ సర్వీస్, గ్రూప్-బి
22. ఢిల్లీ, అండమాన్-నికోబార్, లక్ష దీవులు, డయ్యూ-డామన్, దాద్రా-నాగర్ హవేలీ పోలీస్ సర్వీస్, గ్రూప్-బి
23. పాండిచ్చేరి సివిల్ సర్వీస్
24. పాండిచ్చేరి పోలీస్ సర్వీస్

గ్రూప్-2 పేపర్-3

భారత ప్రణాళికలు సామాజిక, ఆర్థిక లక్ష్యాలు

స్వయం సమృద్ధి, స్వావలంబన

భారత పంచవర్ష ప్రణాళికల లక్ష్యాల్లో స్వయంసమృద్ధి, స్వావలంబన కూడా ఉన్నాయి. ప్రత్యేకించి మూడో పంచవర్ష ప్రణాళిక స్వయంసమృద్ధి, స్వావలంబనలను ప్రధాన లక్ష్యంగా ప్రకటించింది. నాలుగో ప్రణాళికలో స్థిరత్వంతో కూడిన వృద్ధితోపాటు స్వావలంబన కూడా ప్రధాన లక్ష్యంగా ఉంది. ఐదో పంచవర్ష ప్రణాళికలో పేదరిక నిర్మూలన, స్వావలంబన ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

అయితే స్వయంసమృద్ధి, స్వావలంబన ప్రతిస్థాపిత పదాలని కొందరు భావిస్తారు. ఇది నిజం కాదు. అలాగని కొందరు భావిస్తున్నట్లు స్వయంసమృద్ధి వ్యవసాయ రంగ సంబంధిత, స్వావలంబన, పారిశ్రామిక సంబంధిత భావనలన్నది కూడా నిజం కాదు. పోటీ పరీక్షలకు తయారవుతున్న అభ్యర్థులు ఈ రెండు భావనలను స్పష్టంగా అర్థంచేసుకోవడం మంచిది.

స్వయంసమృద్ధి అంటే ?

దేశీయ అవసరాలను దేశంలో జరిగే ఉత్పత్తి ద్వారా తీర్చగలిగే శక్తిని దేశం కలిగి ఉండటాన్ని 'స్వయం సమృద్ధి' అంటాం. ఉదాహరణకు భారతదేశ ఆహార అవసరాలకు 250 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు 2009లో అవసరం అనుకుంటే వాటిని మన దేశం ఉత్పత్తి చేయగలిగే శక్తిని కలిగి ఉంటే దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తి విషయంలో స్వయంసమృద్ధిని సాధించింది అని చెప్పగలం.

దేశంలో హరితవిప్లవం సంభవించే (1966-67) వరకు భారతదేశం తనకు కావల్సిన ఆహార ధాన్యాలను తానే ఉత్పత్తి చేసుకునే శక్తిని కలిగిలేదు. తదనంతరం మనం ఆహారధాన్యాల విషయంలో స్వయంసమృద్ధిని సాధించాం. దురదృష్టవశాత్తు కొన్ని సంవత్సరాలుగా మనం గోధుమలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

స్వావలంబన విషయం ఏమిటి?

మన అవసరాలను ఇతరులపై ఆధారపడకుండా తీర్చుకోగలిగితే దానిని స్వావలంబన అంటాం. ఇక్కడ గమనిచాల్సిందేమంటే మన అవసరాలను మనమే తీర్చుకోవడమంటే మన ఉత్పత్తుల ద్వారా కాకపోవచ్చు. అయితే ఇతరులను అప్పు అడగకుండా తీర్చుకోవాలి. ఉదాహరణకు మనకు భారీ యంత్ర పరిజ్ఞానం అవసరం అనుకుంటే దానిని మనం విదేశాల నుంచి తెచ్చుకోవచ్చు. ఈ తెచ్చుకోవడం అప్పుగా కాకుండా మన దేశం నుంచి వేరే ఏవేని వస్తువులను ఎగుమతి చేసి వచ్చిన విదేశీ మారకద్రవ్యంతో భారీయంత్రాలను దిగుమతి చేసుకోవాలి.

అంటే విదేశాలకు అవసరమైన సేవలను, వస్తువులను కానీ మన అవసరాలకు మించి మన దేశంలో ఉత్పత్తి అయి ఎగుమతి చేసే మిగులు వస్తుంది. ఈ ఎగుమతుల ద్వారా వచ్చే విదేశీ మారకద్రవ్యం దిగుమతులకు ఉపయోగపడుతుంది. అప్పుడు మనకు కావాల్సిన విదేశీ వస్తువుల కోసం విదేశాలను అప్పు అడగాల్సిన అవసరం ఉండదు. దీనినే మన అవసరాలను మనమే తీర్చుకోవడం (స్వావలంబన) అంటాం.

అందుకే మనం స్వయంసమృద్ధిని ఆహారధాన్యాల విషయంలో సాధించాం అని చెప్పుకొన్నాం. అయితే 'స్వావలంబన' ప్రయత్నాలు కొనసాగాలి అని ప్రణాళికలు ప్రకటిస్తున్నాయి.

బయటి ప్రపంచం నుంచి రుణం తీసుకోకుండా మన అవసరాలను మనం తీర్చుకున్న రోజున 'మనం స్వావలంబన సాధించాం' అని చెప్పుకొంటాం.



డాక్టర్ టి.సాయిలు

మన దేశ మానవ వనరుల పుణ్యమా అని మనం సేవల సంబంధిత (అదృశ్య) విదేశీ ఖాతాలో మిగులును కలిగి ఉంటున్నాం. వస్తువుల సంబంధిత విదేశీ దృశ్యఖాతాలో మనం లోటును ఎదుర్కొంటున్నాం. ఫలితంగా విదేశాల నుంచి రుణం పొందాల్సి వస్తోంది.

ఇప్పటికే మన దిగుమతుల్లో క్రూడాయిల్ (30 శాతం), మూలధన వస్తువులు (19 శాతం) సింహభాగాన్ని ఆక్రమిస్తున్నాయి. మన ఎగుమతుల్లో సేవలు, వజ్ర వైఢూర్యాలు, రెడీమేడ్ దుస్తులు, రసాయనాలు, ఔషధాలు, యంత్ర పరికరాలు, వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు ప్రధానంగా ఉన్నాయి. అయితే ఈ ఎగుమతుల ద్వారా వస్తున్న విదేశీ ద్రవ్యం దిగుమతులకు సరిపోవడంలేదు. మనం స్వావలంబనను సాధించాలంటే మనం దిగుమతి చేసుకుంటున్న వస్తువుల ద్వారా తీర్చుకుంటున్న మన అవసరాలను మన దేశంలో జరిగే ఉత్పత్తి ద్వారా తీర్చుకోగలగాలి లేదా దిగుమతులకు అవసరమయ్యే విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించే స్థాయిలో మన ఎగుమతులు పెరగాలి. ఈ రెంటిలో ఏది జరిగినా దానిని స్వావలంబన అనే అంటాం.

పైవిధంగా స్వయంసమృద్ధి అంటే మన అవసరాలను మనమే తీర్చుకోగలిగే శక్తిని కలిగి ఉండటం, కాగా స్వావలంబన అంటే మన అవసరాలను మనమే తీర్చుకోవడం. నీవు ఇంటి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలనుకున్నప్పుడు నీ సొంత కాళ్లపై వెళ్లగలిగే శక్తిని కలిగి ఉండటం స్వయంసమృద్ధి అనగలం. నీవు రైల్వేస్టేషన్‌కు కాలి నడకన అయినా వెళ్లాలి లేదా కారులో కూడా వెళ్లవచ్చు. కారు అద్దెను నీవు సొంతంగా (ఇతరులపై ఆధారపడకుండా అంటే అప్పు అడగకుండా) చెల్లించగలగాలి ఇది స్వావలంబన.

నోటిఫికేషన్లు

ఎస్‌బిఐలో 1717 పిఓలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 1717 ప్రొబేషనరీ ఆఫీసర్ (పిఓ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌కు 674 పోస్టులు కేటాయించారు.
మార్చి 7న జరిగే రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. డిగ్రీలో 55 శాతం మార్కులుండాలి. వయసు 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 2010 జనవరి 1 నుంచి ప్రారంభమైంది. చివరితేదీ జనవరి 31. పూర్తి వివరాలకు www.sbi.co.in చూడవచ్చు.

ఛానల్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటేటర్లు

ఎస్‌బిఐ అనుబంధ బ్యాంకుల్లో 'ఛానల్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటేటర్లు' పోస్టుల భర్తీకి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం ఖాళీలు 600. ఎస్‌బిఐతోపాటు అనుబంధ బ్యాంకు శాఖల్లో ఆఫీసర్లుగా పనిచేసి రిటైర్ అయి ఉండాలి. వయసు 62 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులు. ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుంది. పూర్తి వివరాలకు www.sbi.co.in చూడవచ్చు.

షార్‌లో టెక్నీషియన్లు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కు చెందిన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో పలు టెక్నీషియన్ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.
టెక్నీషియన్-ఎ (ఫిట్టర్ 11 పోస్టులు), ఎలక్ట్రానిక్ మెకానిక్ 11, కెమికల్ 1, ఎలక్ట్రికల్ 12, మోటార్ మెకానిక్ 2, రిఫ్రిజిరేషన్ అండ్ ఎసి 4, టర్నర్ 1, మెషినిస్ట్ 1, రేడియోగ్రాఫర్-ఎ 1, ఫైర్‌మన్-ఎ 2, డ్రైవర్ కం ఆపరేటర్-ఎ 1. దరఖాస్తుల స్వీకరణకు ఆఖరితేది జనవరి 16.
చిరునామా: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, రిక్రూట్‌మెంట్ సెక్షన్, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), శ్రీహరికోట - 524124, నెల్లూరు జిల్లా. దరఖాస్తు, వివరాలకు www. shar.gov.in/advt/html చూడవచ్చు.

అడ్మిషన్లు

అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ అర్హత పరీక్ష

హైదరాబాద్‌లోని బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2010 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత పరీక్ష కు నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో సాధించిన అర్హతతో బీఏ/ బికాం/ బీఎస్సీ కోర్సుల్లో ఎలాంటి ముందస్తు అర్హత లేకుండా చేరవచ్చు. ఏప్రిల్ 11న ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులంతా ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. యూనివర్సిటీ క్యాంపస్/ స్టడీ సెంటర్/ ఇ - సేవా కేంద్రాల్లో దరఖాస్తులు లభ్యమవుతాయి. జనవరి 28లోగా పూర్తి చేసిన దరఖాస్తులను పంపుకోవాల్సి ఉంటుంది.
వెబ్‌సైట్: www.manabadi.com, www.braou.ac.in

గీతం అడ్మిషన్ టెస్ట్

విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అడ్మిషన్ టెస్ట్‌లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బి.టెక్, బి.ఫార్మసీ, ఎంసిఎ (యుజిటిపి); ఎం.ఫార్మసీ (జిఎటి పిజిపి); బిబిఎం, ఎంబిఎ -అయిదేళ్ళు (జిఎటి యుజిఎం); ఎంబిఎ, ఎంహెచ్ఆర్ఎం, పిజిడిఆర్ఐఎం, ఎమ్మెస్సీ మేనేజ్‌మెంట్, అమెరికాలోని సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటీ ఎంబిఎ (జిఎటి పిజిఎం) టెస్ట్‌లను నిర్వహిస్తోంది. ఇవన్నీ ఆన్‌లైన్ టెస్ట్‌లు. ఏప్రిల్ 16 నుంచి మే 5 వరకు జరుగుతాయి. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ చూసుకోవచ్చు.
వెబ్‌సైట్: www.gitam.edu,
ఇ-మెయిల్: director_admissions@gitam.in

నాగార్జున వర్సిటీలో దూరవిద్యా కోర్సులు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2010 క్యాలెండర్ సంవత్సరానికి అడ్మిషన్ల ప్రకటన విడుదల చేసింది. పలు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
నేరుగా ప్రవేశానికి: బిఎ, బికాం, బిఎస్సీ, బిబిఎం, బిహెచ్ఎం, బిఎల్ఐఎస్సి, ఎంఎ, ఎంకాం, ఎంహెచ్ఆర్ఎం, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, పిజి డిప్లొమా, డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులు.
ప్రవేశపరీక్ష ద్వారా: బిఎ, బికాం, బిఎస్సీ, బిబిఎం, బిహెచ్ఎం, ఎంబిఎ, ఎంసిఎ.
దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రుసుము కింద డైరెక్టర్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పేరిట నాగార్జుననగర్ లేదా గుంటూరులో చెల్లేవిధంగా డిడి తీసి పంపాలి. పోస్టు ద్వారా అయితే పలు కోర్సులకు రూ.150 నుంచి రూ.550 వరకు దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కోర్సు ఫీజు, ఇతర వివరాలకోసం www.anucde.com చూడవచ్చు.

యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్

స్టాఫోర్డ్‌షైర్ యూనివర్సిటీతో కలిసి మద్రాసు విశ్వవిద్యాలయం పార్ట్‌టైమ్ పిజి కోర్సులను ఆన్‌లైన్‌లో అందిస్తోంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నది.
కోర్సుల వివరాలు
- ఎంఎస్సీ సస్టయినబిలిటీ అండ్ నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్.
- ఎంఎస్సీ సస్టయినబిలిటీ డెవలప్‌మెంట్ ఫర్ అర్బన్ ఎన్విరాన్‌మెంట్

ఈ కోర్సులను యుకె - ఇండియా ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ కింద ఆన్ క్యాంపస్ వర్క్‌షాపులతో ఆన్‌లైన్‌లో అందిస్తోంది.
చిరునామా: యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, జాయింట్ అవార్డ్ కోఆర్డినేటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జాగ్రఫీ, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, చెన్నై - 600 005 దరఖాస్తు స్వీకరణకు చివరితేది జనవరి 13. దరఖాస్తు, కోర్సు వివరాలకు www.unom.ac.in చూడవచ్చు.

'బాస్' అవుతారా..? ఈ సైట్ తెరవండి!



వెబ్ వాచ్

ప్రతి విద్యా సంస్థలో రెండు రకాల విద్యార్థులు కనిపిస్తారు. మొదటి రకం, చదువులు ఎప్పుడు పూర్తవుతాయా..ఎప్పుడు ఒక మంచి సంస్థలో మంచి ఉద్యోగంలో కుదురుకుందామా అని ఆలోచించేవారు. రెండో రకం కాస్త భిన్నంగా ఆలోచించేవారు. చదువు పూర్తి కాగానే ఏ వ్యాపారం ప్రారంభించాలా అని సీరియస్‌గా ఆలోచించేవారు. అయితే వారి సంఖ్య తక్కువే కావచ్చు. ఇటీవల భారతీయ విద్యార్థుల్లో సొంత కాళ్లపై నిలదొక్కుకోవాలని ఆలోచించే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఆర్థిక రంగంలో వచ్చిన మార్పుల కారణంగా సవాళ్లతో కూడిన సొంత వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలన్న అభిలాష ఆ తరహా ఆలోచనలకు మూలం కావచ్చు.

సొంతంగా ఏదో ఒకటి సృష్టించాలని..లేదా స్వతంత్రంగా జీవించాలని భావించడంతో ఉద్యోగాలను వెతుక్కునే వ్యాసంగానికి స్వస్తి చెప్పడమే కాదు; మరో నలుగురికి వారు ఉపాధి కల్పించగలుగుతున్నారు. అలా ఆలోచించే వారిని 'నేషనల్ ఎంటర్‌ప్రెన్యుయర్ నెట్ వర్క్' (ఎన్ఈఎన్) ఎంతగానో ప్రోత్సహిస్తోంది. దాని నేతృత్వంలో http://nenonline.org పేరిట ఒక వెబ్‌సైట్ 2003లో ఏర్పాటయింది. అప్పటి నుంచి సొంత కాళ్లపై నిలదొక్కుకోవాలని భావించే వారికి ప్రేరణనిస్తోంది. అవసరమైన అవగాహన కల్పిస్తోంది. అందుకోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించింది. అందులో ఏకంగా రెండున్నర లక్షల మంది వీక్షకులు రిజిస్టర్ చేసుకొన్నారు. వ్యాపారవేత్తల కోసం ఉద్దేశించిన వెబ్‌సైట్‌లలో అది భారతదేశంలో అగ్రగామిగా నిలుస్తోంది.

ఏముంటుంది..?

ఈ సైట్‌లో వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన అనేక అంశాలను పొందుపరిచారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించిన వారు ఎదుర్కొన్న సాధకబాధకాలు..వ్యాపారం ఆరంభించేందుకు అవసరమైన కొత్త ఆలోచనలు..ముఖాముఖి..ఏ రోజు ఏ కార్యక్రమం జరగనుందన్న సమాచారం..వివిధ పోటీలు..పారిశ్రామిక రంగంలో విజయం సాధించిన వారి వీడియో పాఠాలు.. నిధులు సమీకరించడం..ఇంకా ఎన్నో అవసరమైన విషయాలను సైట్ సుబోధకం చేస్తుంది.

హోం పేజీ

హోం పేజీని చక్కగా, సుందరంగా తీర్చిదిద్దారు. బోల్డ్ కలర్స్‌ను ఉపయోగించారు. ఈ పేజీలో అవసరమైన సమాచారంతో పాటు అనేక లింక్‌లను పొందుపరిచారు. పేజీ పైభాగంలో నాలుగు ప్రధాన విభాగాలుంటాయి. అవి నెన్-360, నెన్ వీడియోస్, ఈవెంట్స్, నాలెడ్జ్ బ్యాంక్. నిజంగా వ్యాపారం చేయాలన్న ఆసక్తి ఉన్న వారు గంటల తరబడి సైట్‌కు అతుక్కుపోవడం ఖాయం. నెన్-360 విభాగం నిజానికి కమ్యూనిటీ న్యూస్ లెటర్. దేశంలోని వ్యాపార రంగంలో చోటు చేసుకొంటున్న మార్పులను అది చక్కగా వివరిస్తుంది. మార్కెట్‌లోని కొత్త ధోరణులు, విజయగాథలు, బిజినెస్ స్కూల్స్ అధినేతలతో ఇంటర్వ్యూలను అందులో చూడవచ్చు. ఏ నెలకానెల సంబంధింత న్యూస్ లెటర్స్‌ను పీడీఎఫ్ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రిజిస్టర్ చేసుకొన్న పక్షంలో నేరుగా మీ ఈ-మెయిల్ చిరునామాకు న్యూస్ లెటర్ వస్తుంది.

వీడియో విభాగంలో ఆసక్తికరమైనవి..ఆలోచనలు రేకెత్తించేవీ అనేకం ఉన్నాయి. బైకాన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ మజుందార్ తన బృందాన్ని ఎలా రూపొందించుకున్నారో వివరించే వీడియో మచ్చుకు ఒకటి మాత్రమే! దేశ విదేశీ ప్రముఖుల వీడియోలను అంశాల వారీగా.. వ్యక్తుల వారీగా సైట్‌లో అన్వేషించవచ్చు. ఈవెంట్స్ విభాగంలో కావల్సిన అంశాలను నగరం, మాసం, అంశం వారీగా గుర్తించవచ్చు. ఇక నాలెడ్జ్ బ్యాంక్ విభాగం వ్యాపార జ్ఞానానికి సంబంధించిన బహు ముఖాలను ఆవిష్కరిస్తుంది. ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని పొందుపరచడం ఈ సైట్ ప్రత్యేకత. దేశంలోని పేరు పొందిన విద్యా సంస్థల భాగస్వామ్యంతో 'వాధ్వానీ ఫౌండేషన్' ఈ సైట్‌ను ఏర్పాటు చేసింది. స్థాపక ఉద్దేశాలకు అనుగుణంగా ఈ సైట్ ఇప్పటికే బహుళ ప్రజాదరణ పొందింది. అనేక మంది యువ వ్యాపారులు తమ ప్రస్థానాన్ని ఎలా ప్రారంభించారన్న విషయాలను స్ఫూర్తిదాయకంగా సైట్ వివరిస్తుంది. ఇంకా ఎందుకాలస్యం..? ఓపెన్ ఇట్!

– లింగంపల్లి

చుక్కాని



చుక్కా రామయ్య

నష్టం లేకుండా విద్యా సంవత్సరం

విద్యార్థుల్లో దృఢ సంకల్పం పెరుగుతోంది. యువకులు ప్రతి యుగంలో స్వప్రయోజనం కన్నా సమాజ ప్రయోజనానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే వారు మొత్తం సమాజానికే ఆశాజ్యోతులుగా మారారు. విద్యార్థులకు గతం కన్నా భవిష్యత్తుపైనే ఎక్కువ ఆశ ఉండటం సహజం. అది కూడా ప్రజాస్వామిక విలువలకై, దోపిడీ లేని సమాజం కోసమై విద్యార్థులు పోరాటానికి సిద్ధమవడం శుభసూచకం. అయితే తల్లిదండ్రుల్లో ఆదుర్దా కలిగించడం సహజం. పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులను కలవరపరుస్తున్నది. ప్రతిరోజూ నాకు ఎన్నో టెలిఫోన్లు వస్తున్నాయి. అయితే ఒక ఉపాధ్యాయునిగా విద్యార్థుల నాడి తెలిసిన మనిషిగా తల్లిదండ్రులకు ఒక విజ్ఞప్తి చేయదలిచాను. ఇలాంటి పిల్లలను కన్నందుకు అభినందనలు. ఇలాంటి పరిస్థితులు తెలంగాణలో, సీమాంధ్రలో ఇదివరకు కూడా వచ్చాయి. ఆ సమయంలో తీసుకున్న జాగ్రత్తలే ఇప్పుడు కూడా పాటించే అవకాశమున్నది. దీనిలో పదో తరగతి, ఇంటర్ కన్నా తక్కువగా ఉన్న పిల్లలను కావాలనే ఉద్యమంలో భాగస్వాములను చేయలేదు. వారి సిలబస్‌కు ఇప్పటివరకు అవాంతరాలు రాలేదని కాదు. వారి సిలబస్ ఎంతవరకు పూర్తయిందో అంతవరకే పరీక్షపత్రాలను రూపొందించవచ్చు. పరీక్షలు కేవలం విషయ పరిజ్ఞానం కన్నా బుద్ధి కుశలతనే పరీక్షించడం కాబట్టి ఆ సిలబస్‌లోనే మన లక్ష్యం పూర్తిచేసుకోవచ్చు. చివరకు ఎంసెట్ పరీక్ష కూడా ఇదే పద్ధతిలో నిర్వహించుకునే అవకాశం ఉంది. అయితే, ఆలిండియా స్థాయి పోటీ పరీక్షలకు కొంత ఇబ్బంది జరగవచ్చు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఆ విద్యార్థులు తమకు జరిగిన నష్టాన్ని పూరించుకునే శక్తి, భరించగల శక్తి ఉన్న వారేనని అనుకుంటాను. అదే మాదిరిగా వివిధ కోర్సుల్లో ఉన్న విశ్వవిద్యాలయ విద్యార్థులకు కూడా నష్టం జరగకుండా చేయవచ్చు.

గతంలో ఉస్మానియా ఈ విధమైన పరిస్థితుల్లో అవలంబించిన పద్ధతులున్నాయి. విద్యా సంవత్సరం నష్టం లేకుండా పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు వైస్ చాన్సలర్లు, విద్యాధికారులు సమావేశమై ఒక కార్యక్రమాన్ని రూపొందించవచ్చు. అలాంటి ఆలోచనే ఉన్నట్లు నాకు సమాచారం అందింది. ఒక శాశ్వతమైన భవిష్యత్తు కోసమై, తాత్కాలికమైన ఇబ్బందిని తల్లిదండ్రులు భరిస్తారనే నేను ఆశిస్తాను. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అందరూ విశ్వవిద్యాలయాలకు సహకరిస్తే విద్యా సంవత్సరం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.